AUCHITHYAM
(A Monthly Peer-Reviewed Online Telugu Research Journal)
Language & Literature | Linguistics | Arts & Humanities | Social Sciences
ISSN 2583-4797 (Online)
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM | Volume-7 | Issue-11 | October 2026 | Peer-Reviewed | ISSN: 2583-4797

ఔచిత్యమ్ పరిశోధన మాసపత్రిక ఆరవ వార్షికోత్సవ సంచిక

1. 'మాలిక్ కాఫర్' నవల: కాకతీయ సాంస్కృతికజీవనచిత్రణ



మ్యాడం అభిలాష్
కంటెంట్ రైటర్, టాల్ రేడియో,
థింక్ ట్యాంక్ మెంబర్, బోలి చేతో ఫౌండేషన్,
హైదరాబాద్, తెలంగాణ.
Cell: 8142576346 | Email: abhilashmyadam04@gmail.com

Received: 20 Sep 2026 | **Accepted:** 30 Sep 2026 | **Published:** 01 Oct 2026
Article: https://www.auchithyam.com/2026/oct_2026/full_papers/october26_01.php

ABSTRACT

ముదిగొండ శివప్రసాద్ రచించిన ‘మాలిక్ కాఫర్’ నవలలో కాకతీయుల సాంస్కృతిక జీవనం ఏ విధంగా చిత్రితమైందో పరిశీలించడం ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశం. కాకతీయుల కాలం నాటి ఆచారాలు, మతవిశ్వాసాలు, కళలు, దేవాలయ సంస్కృతి, ఉత్సవాలు, స్త్రీల జీవనం, ప్రజల జీవన విధానం వంటి అంశాలను నవల ఆధారంగా పరిశీలించడంతో పాటు, వాటికి సంబంధించిన చారిత్రక ఆధారాలతో పోల్చి చూడడం జరుగుతుంది. ఈ పరిశోధనకు ‘మాలిక్ కాఫర్’ నవలను ప్రధాన ఆధారంగా, కాకతీయుల చరిత్ర, సంస్కృతి, సామాజిక జీవనానికి సంబంధించిన చారిత్రక గ్రంథాలు, పరిశోధనా వ్యాసాలు, విమర్శలను ఇతర ఆధారాలుగా తీసుకోవడం జరుగుతుంది. నవలలోని సాంస్కృతిక అంశాలను గుర్తించి, వాటి చిత్రణను విశ్లేషణాత్మక, తులనాత్మక పద్ధతుల్లో పరిశీలిస్తాను. ఈ అధ్యయనం ద్వారా కాకతీయుల సాంస్కృతిక జీవన విధానాన్ని రచయిత ఏ విధంగా నవలలో చిత్రించాడో, చారిత్రక అంశాలకు సాహిత్య కల్పన ఎలా తోడుగా నిలిచిందో తెలుసుకోవచ్చు. ఈ పరిశోధన నవలలో ప్రతిఫలించిన సాంస్కృతిక అంశాలకే పరిమితం చేయబడుతుంది.

Keywords: కాకతీయులు, కాకతీయసామ్రాజ్యం, సాంస్కృతికజీవనం, మాలిక్ కాఫర్, చారిత్రక నవల, సాంస్కృతికచిత్రణ, తెలుగు చారిత్రకనవల, చారిత్రకసాహిత్యం

1. ప్రవేశిక

చరిత్రను రాయడం ఒక ఎత్తయితే, చరిత్రలోని మనుషులను, వారి ఆలోచనలను, నమ్మకాలను, జీవన విధానాలను కథారూపంలో పాఠకుల ముందుంచడం మరో ఎత్తు. ఈ రెండింటినీ సమన్వయం చేస్తూ తెలుగు నవలా సాహిత్యంలో తనదైన గుర్తింపు సంపాదించుకున్న రచయిత ఆచార్య ముదిగొండ శివప్రసాద్ గారు! చారిత్రక సంఘటనలను ఆసక్తికరమైన కథనాలుగా మలిచి, గతకాలపు జీవితాలను పాఠకుల కళ్లముందు నిలిపిన చారిత్రిక నవలా చక్రవర్తి. చరిత్రను కేవలం సంఘటనల సమాహారంగా మాత్రమే కాకుండా, ఒక సమాజపు జీవన చిత్రంగా ఆవిష్కరించారు!

ఇటీవలే ఆయన మన నుండి దూరమైనా తన రచనల రూపంలో పాఠకుల ఆలోచనల్లో జీవిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన సాహిత్యాన్ని ఓసారి మనం గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆయన నవలల్లో చారిత్రక వ్యక్తులు, రాజ్యాలు, యుద్ధాలు మాత్రమే కాకుండా, ఆయా కాలాల సామాజిక పరిస్థితులు, మత విశ్వాసాలు, సాంస్కృతిక సంప్రదాయాలు కూడా కనిపిస్తాయి. 'మాలిక్ కాఫర్' నవల ఇందుకు ఒక మంచి ఉదాహరణ. ముఖ్యంగా ఈ నవలలో ప్రతిబింబించిన కాకతీయుల సామాజిక, సాంస్కృతిక జీవనాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు.

మాలిక్ కాఫర్ నవల ప్రధానంగా కాకతీయ సామ్రాజ్య పతనానికి దారితీసిన రాజకీయ పరిణామాలు, ఢిల్లీ సుల్తానుల దండయాత్రలు, వాటిని ఎదుర్కొనేందుకు ప్రతాపరుద్రుడు చేసిన ప్రయత్నాల నేపథ్యంలో సాగుతుంది. దక్షిణ భారతదేశంపై ఆధిపత్యం సాధించాలనే ఢిల్లీ సుల్తానుల ఆకాంక్ష, మాలిక్ కాఫర్, ఉలూఘ్‌ఖాన్‌ల సైనిక దండయాత్రలు ఈ కథలో కీలకంగా కనిపిస్తాయి. ఈ పరిణామాల మధ్య కాకతీయుల రాజ్యరక్షణ, మత విశ్వాసాలు, కళలు, సాంస్కృతిక సంప్రదాయాలు, సామాన్య ప్రజల జీవితాలు కూడా ఈ కథలో కనిపిస్తాయి. దీంతో అప్పటి చారిత్రక వ్యక్తులు, సంఘటనలకు కల్పనను జోడిస్తూ ఆనాటి సమాజాన్ని పాఠకుల కళ్లముందు నిలిపే ప్రయత్నం చేశారు.

2. కాకతీయుల కాలానికి కథారూపం

కాకతీయుల చరిత్ర తెలుగు ప్రజల చారిత్రక, సాంస్కృతిక వారసత్వంలో ఒక ప్రత్యేకమైన అధ్యాయం. ఓరుగల్లు (నేటి వరంగల్) రాజధానిగా విస్తరించిన కాకతీయ సామ్రాజ్యం దక్షిణ భారతదేశ చరిత్రలో విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకుంది. ముఖ్యంగా గణపతిదేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుడు వంటి పాలకుల కాలంలో కాకతీయ రాజ్యం రాజకీయంగా బలపడటమే కాకుండా, సామాజికంగా, సాంస్కృతికంగా కూడా ఎంతో అభివృద్ధి చెందింది. దేవాలయ నిర్మాణం, శిల్పకళ, నృత్యం, సంగీతం, సాహిత్యం వంటి కళలకు ప్రోత్సాహం లభించింది. వ్యవసాయం, చెరువుల నిర్మాణం, సాగునీటి అభివృద్ధి, వాణిజ్యం వంటి రంగాలు రాజ్య ఆర్థిక వ్యవస్థకు బలాన్నిచ్చాయి. ఓరుగల్లు కోట, రామప్ప దేవాలయం, వేయిస్తంభాల గుడి వంటి నిర్మాణాలు ఆనాటి శిల్పకళా వైభవానికి నిదర్శనాలుగా నిలిచాయి. మరోవైపు నాయంకర వ్యవస్థ, సైనిక బలగాలు, దుర్గాల నిర్మాణం ద్వారా కాకతీయులు తమ రాజ్య రక్షణకు ప్రాధాన్యతనిచ్చారు. ఈ విధంగా కాకతీయుల పాలన అనేది కేవలం రాజ్య విస్తరణకు, యుద్ధ విజయాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఒక సమాజపు జీవన విధానాన్ని, కళా సంస్కృతులను, ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసిన చారిత్రక కాలంగా గుర్తింపు పొందింది.

అయితే కాకతీయుల చరిత్రలో ప్రతాపరుద్రుడి కాలం అనేక రాజకీయ సవాళ్లతో కూడుకున్నది. ఉత్తర భారతదేశంలో ఢిల్లీ సుల్తానుల విస్తరణ, దక్షిణాది రాజ్యాలపై వారి దండయాత్రలు కాకతీయ సామ్రాజ్యానికి పెద్ద ముప్పుగా పరిణమించాయి. ముఖ్యంగా అల్లావుద్దీన్ ఖిల్జీ కాలం నుంచి కాకతీయ రాజ్యంపై దండయాత్రలు ప్రారంభమై, ఆ తర్వాత ఉలుఘ్ ఖాన్ నాయకత్వంలో జరిగిన దాడులు ఓరుగల్లు రాజ్య భవిష్యత్తును ప్రభావితం చేశాయి. ఈ పరిణామాలు కేవలం రాజుల మధ్య జరిగిన అధికార పోరాటాలుగానే కాకుండా, ప్రజల జీవన విధానం, ఆర్థిక పరిస్థితులు, మతపరమైన సంస్థలు, సాంస్కృతిక సంప్రదాయాలపై కూడా ప్రభావం చూపాయి. ఒకవైపు రాజ్యాన్ని కాపాడుకోవాలనే కాకతీయుల ప్రయత్నాలు, మరోవైపు ప్రజల్లో నెలకొన్న ఆందోళనలు, యుద్ధాల వల్ల ఏర్పడిన అనిశ్చిత పరిస్థితులు ఆనాటి సమాజాన్ని సంక్షోభంలోకి నెట్టాయి.

ఇలాంటి చారిత్రక నేపథ్యాన్ని ఇతివృత్తంగా తీసుకొని ఆచార్య ముదిగొండ శివప్రసాద్ గారు రచించిన నవల

'మాలిక్ కాఫర్'. ఇందులో ఆయన కాకతీయ సామ్రాజ్యాన్ని కేవలం రాజులు, రాజ్యాలు, యుద్ధాలు, అధికార పోరాటాలకే పరిమితం చేయలేదు. ఆ రాజ్యానికి పునాదిగా నిలిచిన ప్రజలు, వారి మత విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, కళా సంప్రదాయాలు, సామాజిక సంబంధాలు, సైనిక వ్యవస్థ వంటి అనేక అంశాలను కథనంలో భాగం చేశారు. ముఖ్యంగా ప్రతాపరుద్రుడి పాలనాకాలంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలను చిత్రిస్తూనే, ఆ సంక్షోభ సమయంలో కాకతీయ సమాజం ఎలా స్పందించింది? వివిధ మత సంప్రదాయాల మధ్య ఎలాంటి చర్చలు జరిగాయి? రాజ్యరక్షణలో ప్రజలు, మత సంస్థలు, సైనిక వ్యవస్థ ఎలాంటి పాత్ర పోషించాయి? వంటి ప్రశ్నలను తన కథనం ద్వారా ముందుకు తీసుకొచ్చారు. ఈ విధంగా 'మాలిక్ కాఫర్' నవల కాకతీయుల రాజకీయ చరిత్రను పరిచయం చేయడంతో పాటు, ఆనాటి సమాజపు సాంస్కృతిక, సామాజిక జీవనాన్ని కూడా పాఠకుల ముందుంచే ప్రయత్నం చేస్తుంది.

3. మత విశ్వాసాలు – సామాజిక జీవనం

ఈ నవలలో కనిపించే ప్రధానమైన అంశాల్లో మత విశ్వాసాలు ఒకటి. కాకతీయుల కాలంలో శైవ, వైష్ణవ సంప్రదాయాలు సమాజంలో విస్తృతంగా ఉన్నట్లు రచయిత చిత్రించారు. ఆనాటి ప్రజల జీవన విధానంలో మతం, ఆధ్యాత్మికత కీలక పాత్ర పోషించినట్లు కథనం ద్వారా తెలుస్తుంది. దేవాలయాలు కేవలం పూజలు, వ్రతాలు నిర్వహించే ప్రదేశాలుగానే కాకుండా, ప్రజలు సమావేశమయ్యే, చర్చలు జరిపే, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే కేంద్రాలుగా కూడా కనిపిస్తాయి. మతపరమైన కార్యక్రమాల ద్వారా ప్రజల మధ్య సామాజిక సంబంధాలు బలపడటంతో పాటు, సమాజంలోని ఆలోచనలు, అభిప్రాయాలు ఒకరితో ఒకరు పంచుకునే అవకాశం ఏర్పడినట్లు రచయిత వివరించారు.

నవలలోని ఒక సందర్భంలో వైష్ణవ పండితులు పంచాల రాయదేవాలయంలో సమావేశమవుతారు. అక్కడ వారు నాలాయిర దివ్యప్రబంధాన్ని గానం చేస్తూ, ఆళ్వారుల భక్తి సంప్రదాయాలను స్మరించుకుంటారు. ఈ ఘట్టం ద్వారా వైష్ణవ సాహిత్యం, భక్తి సంగీతం ఆనాటి ఆధ్యాత్మిక జీవితంలో ఎలాంటి స్థానం కలిగి ఉన్నాయో రచయిత పరిచయం చేశారు. అయితే ఆ సమావేశం కేవలం భక్తి కార్యక్రమానికే పరిమితం కాదు. రాజ్యరక్షణ, ప్రజల భద్రత, శాంతి, యుద్ధం వంటి అంశాలపై కూడా పండితుల మధ్య చర్చ జరుగుతుంది. ఒకవైపు మత విశ్వాసాలను కాపాడుకోవాలనే ఆలోచన, మరోవైపు రాజ్యానికి ఎదురవుతున్న ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలనే ఆందోళన వారి మాటల్లో కనిపిస్తాయి.

ఈ చర్చల్లో భగవద్గీత సందేశం, రామానుజాచార్యుల బోధనలు, బసవన్న భావాలను రచయిత ప్రస్తావించారు. భగవద్గీతలోని కర్తవ్య భావనను, రామానుజాచార్యుల భక్తి మార్గాన్ని, బసవన్న ఆలోచనలను పాత్రల సంభాషణల్లో భాగం చేశారు. దీని ద్వారా ఆనాటి సమాజంలో మతపరమైన విశ్వాసాలు మాత్రమే కాకుండా, వాటికి సంబంధించిన తాత్విక చర్చలు కూడా ప్రాధాన్యం పొందినట్లు చూపించారు. ముఖ్యంగా యుద్ధం చేయాలా? శాంతిని కోరుకోవాలా? రాజ్యాన్ని, ప్రజలను కాపాడటంలో మతపెద్దల పాత్ర ఏమిటి? అనే ప్రశ్నలను ఈ సమావేశం ద్వారా పాఠకుల ముందుంచారు.

ఇక శైవ సంప్రదాయాల చిత్రణలోనూ రచయిత ప్రత్యేక శ్రద్ధ చూపించారు. శాంభవీ దీక్ష, లింగధారణ, రుద్రాక్ష ధారణ వంటి ఆచారాలను నవలలో ప్రస్తావించారు. ఇవి శైవ భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలను, వారి జీవన విధానాన్ని తెలియజేస్తాయి. ముఖ్యంగా శైవ సంప్రదాయంలో గురువుకు ఉన్న స్థానం, దీక్ష ద్వారా భక్తుడు ఒక ఆధ్యాత్మిక మార్గంలోకి ప్రవేశించే విధానం వంటి అంశాలను కథనంలో పరిచయం చేశారు. వీరభద్రసేన ప్రస్తావన ద్వారా శైవ భక్తులు సంఘటితంగా ఉండటం, తమ సంప్రదాయాల పట్ల నిబద్ధతను కలిగి ఉండటం వంటి విషయాలను కూడా చూపించారు.

ఈ సందర్భాల్లో శైవ భక్తి వ్యక్తిగత పూజలు, ఆధ్యాత్మిక సాధనకే పరిమితం కాకుండా, సమాజంతోనూ సంబంధం కలిగి ఉన్నట్లు రచయిత చిత్రించారు. అప్పటి పరిస్థితుల్లో మతపరమైన సంస్థలు, గురువులు, భక్తుల సమూహాలు ప్రజల జీవితాల్లో ప్రభావం చూపినట్లు మనకు తెలుస్తుంది. రాజ్యానికి సంక్షోభం ఎదురైనప్పుడు ప్రజల మధ్య ఐక్యత, ధైర్యం, తమ సంప్రదాయాల పట్ల నిబద్ధత అవసరమనే భావన కూడా ఈ ఘట్టాల్లో కనిపిస్తుంది.

మరోవైపు, నవలలో శైవ, వైష్ణవ సంప్రదాయాలను వేర్వేరు మతపరమైన ఆచారాలుగా మాత్రమే చూపించకుండా, వాటి మధ్య ఉన్న ఆలోచనా వైవిధ్యాన్ని కూడా పరిచయం చేశారు. వైష్ణవ పండితుల సమావేశంలో జరిగే చర్చలు, శైవ సంప్రదాయాలకు సంబంధించిన దీక్షలు, ఆచారాలు – ఈ రెండింటి ద్వారా ఆనాటి సమాజంలో భక్తి, తాత్విక చింతన, సామాజిక బాధ్యతలు పరస్పరం ఎలా ముడిపడి ఉన్నాయో అర్థమవుతుంది.

4. కళలు – సాహిత్యం – సాంస్కృతిక సంప్రదాయాలు

కాకతీయుల కాలం అనగానే గుర్తుకొచ్చే అంశాల్లో దేవాలయాలు, శిల్పకళ, నృత్యం, సంగీతం ముఖ్యమైనవి. ఆ కాలంలో నిర్మించిన దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలుగానే కాకుండా కళలకు నిలయాలుగా కూడా ఉండేవి. దేవాలయాల గోడలపై కనిపించే శిల్పాలు, నాట్య భంగిమలు ఆనాటి కళా వైభవాన్ని తెలియజేస్తాయి. ఈ సాంస్కృతిక నేపథ్యానికి సంబంధించిన ప్రస్తావనలు కూడా ముదిగొండ శివప్రసాద్ గారి మాలిక్ కాఫర్ నవలలో కనిపిస్తాయి. ముఖ్యంగా మాచలదేవి, అంబాదేవి వంటి పాత్రల ద్వారా ఆనాటి నృత్యకళకు, కళాకారులకు సమాజంలో ఉన్న ప్రాధాన్యాన్ని రచయిత పరిచయం చేశారు.

నవలలో అంబాదేవి నృత్య ప్రదర్శనకు సంబంధించిన ఘట్టం ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. ఈ సందర్భంలో రచయిత నృత్యాన్ని కేవలం శరీర కదలికలుగా కాకుండా, భావాలను వ్యక్తం చేసే ఒక కళారూపంగా వివరించారు. ఆంగికాభినయం, సాత్వికాభినయం వంటి అంశాలను ప్రస్తావించడం ద్వారా నృత్యంలో శరీర భంగిమలతో పాటు ముఖ కవళికలు, అంతరంగ భావాలు కూడా ఎంత ముఖ్యమో తెలియజేశారు. నర్తకి తన కదలికలు, చూపులు, హావభావాల ద్వారా ఒక భావాన్ని ప్రేక్షకులకు ఎలా చేరవేయగలదో ఈ ఘట్టం ద్వారా అర్థమవుతుంది. నృత్యకళలో సాధన, నైపుణ్యం, భావవ్యక్తీకరణకు ఉన్న ప్రాధాన్యాన్ని రచయిత పాత్రల ద్వారా వివరించారు.

మాచలదేవి, అంబాదేవి వంటి పాత్రల ప్రస్తావనతో ఆనాటి సమాజంలో మహిళలు కళారంగంలో పోషించిన పాత్రను కూడా రచయిత కథలోకి తీసుకొచ్చారు. కళలు రాజాస్థానాలకో, ఉత్సవాలకో మాత్రమే పరిమితం కాకుండా సమాజంలోని వివిధ వర్గాల జీవితాలతో ముడిపడి ఉన్నట్లు ఈ పాత్రల ద్వారా తెలుస్తుంది. నృత్యం, సంగీతం వంటి కళలకు ఆదరణ ఉండటంతో పాటు, వాటిని అభ్యసించే కళాకారులకు కూడా ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నట్లు తెలుస్తుంది.

ఈ నవలలో కళలకు సంబంధించిన మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే యుద్ధ సమయాల్లో కళారూపాల పాత్ర. సాధారణంగా యుద్ధం అనగానే సైనికులు, ఆయుధాలు, వ్యూహాలు గుర్తుకొస్తాయి. కానీ రచయిత కళాకారులు కూడా సమాజానికి ధైర్యాన్ని, స్ఫూర్తిని అందించగలరనే కోణాన్ని ప్రస్తావించారు. ఒకవైపు లాస్య నృత్యాల ద్వారా సున్నితమైన భావాలను, సౌందర్యాన్ని వ్యక్తం చేస్తే, మరోవైపు వీరభటుల ఖడ్గనృత్యాల ద్వారా వీరత్వాన్ని, పోరాట స్ఫూర్తిని ఆవిష్కరించారు. ఈ రెండు రూపాలు కళలోని భిన్నమైన వ్యక్తీకరణలను తెలియజేస్తాయి. కళ మనసుకు ఆనందాన్ని ఇవ్వడమే కాకుండా, అవసరమైన సమయంలో ప్రజల్లో ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపగలదనే భావనను ఈ ఘట్టాల ద్వారా రచయిత ముందుకు తెచ్చారు.

ఇక్కడ గమనించాల్సిన మరో విషయం ఏమిటంటే, నవలలో కళలు ఆనాటి ప్రజల దైనందిన జీవితానికి, వారి భావోద్వేగాలకు దగ్గరగా కనిపిస్తాయి. నృత్యం, సంగీతం, శిల్పకళ వంటి అంశాలు ఒక సమాజపు అభిరుచులను మాత్రమే కాకుండా, వారి జీవన విధానాన్ని, ఆలోచనా ధోరణిని కూడా ప్రతిబింబిస్తాయి. ముఖ్యంగా సంక్షోభ సమయంలోనూ కళలు ప్రజలలో ఐక్యతను, ధైర్యాన్ని పెంపొందించే సాధనాలుగా ఉండగలవనే విషయాన్ని సూచించారు.

5. యుద్ధ వ్యూహాలు – కోటలు – రాజ్యరక్షణ

మాలిక్ కాఫర్ నవలలో మరో ముఖ్యమైన అంశం కాకతీయుల సైనిక వ్యవస్థ, యుద్ధ వ్యూహాలు. కాకతీయుల రాజ్యానికి ఉన్న భౌగోళిక పరిస్థితులు, కోటల నిర్మాణం, వాటి రక్షణ విధానాలను కూడా ఇందులో వివరించారు. కాకతీయులు రాజ్య రక్షణలో గిరిదుర్గాలు, స్థలదుర్గాలు, నదీ తీర ప్రాంతాల్లోని కోటలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు నవలలో వివరించారు. కొండలపై నిర్మించిన కోటలు, నేలపై ఏర్పాటు చేసిన కోటలు, నదులకు సమీపంలో ఉన్న దుర్గాలు శత్రువుల దాడులను ఎదుర్కోవడంలో ఎలా ఉపయోగపడతాయో కూడా ప్రస్తావించారు. ముఖ్యంగా దేవరకొండ దుర్గం వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని వివరించడం ద్వారా కోటల నిర్మాణంలో భౌగోళిక పరిస్థితులకు ఉన్న ప్రాముఖ్యతను తెలియజేశారు.

నవలలో యుద్ధ వ్యూహాలకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు ఆసక్తిని కలిగిస్తాయి. శత్రు సైన్యాన్ని నేరుగా ఎదుర్కోవడమే కాకుండా, వారి శిబిరాల్లో గందరగోళం సృష్టించి బలహీనపరిచే ప్రయత్నాలను రచయిత కల్పనాత్మకంగా చిత్రించారు. కోతులు, పాములు, తేనెటీగలు, ముళ్లపందులు వంటి జీవులను శత్రు శిబిరాల్లోకి ప్రవేశపెట్టి వారి సైనికులను ఇబ్బందులకు గురిచేసే వ్యూహాలు కూడా మన కళ్ళకు కట్టినట్టు చూపించారు. అలాగే నీటి పీపాల్లో దాక్కొని సైనికులు శత్రు శిబిరాల్లోకి ప్రవేశించే సన్నివేశం కూడా ఉత్కంఠను కలిగిస్తుంది.

ఇక కోటల రక్షణకు సంబంధించిన వివరాలు కూడా నవలలో ప్రాధాన్యం సంతరించాయి. శత్రువులు కోటను ముట్టడించినప్పుడు లోపల ఉన్న సైనికులు ఎలా అప్రమత్తంగా ఉండాలి? కోటలోకి శత్రువులు ప్రవేశించకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అందుబాటులో ఉన్న నీరు, ఆహారం, ఆయుధాలను ఎలా వినియోగించుకోవాలి? వంటి అంశాలు కనిపిస్తాయి. కోట చుట్టూ ఉన్న భౌగోళిక పరిస్థితులను రక్షణకు అనుకూలంగా మలచుకోవడం, శత్రువుల కదలికలను గమనించడం, సరైన సమయంలో దాడి చేయడం వంటి వ్యూహాలకు రచయిత చోటు కల్పించారు.

యుద్ధంలో సమాచార సేకరణ, సైనికుల మధ్య సమన్వయం కూడా ముఖ్యమైనవని నవలలోని సంఘటనలు సూచిస్తాయి. శత్రువుల కదలికలను ముందుగానే తెలుసుకోవడం, ఆ సమాచారాన్ని పాలకులకు, సైనికాధికారులకు చేరవేయడం, పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలను మార్చుకోవడం వంటి అంశాలు రాజ్య రక్షణలో కీలకమైనవిగా కనిపిస్తాయి. అదేవిధంగా నదులు, అడవులు, కొండలు వంటి ప్రకృతి వనరులను తమకు అనుకూలంగా ఉపయోగించుకోవడం ద్వారా యుద్ధంలో భౌగోళిక పరిస్థితులు ఎంతటి ప్రభావాన్ని చూపగలవో రచయిత తెలియజేశారు.

ఈ యుద్ధ ఘట్టాల్లో మరో ముఖ్యమైన అంశం ప్రజల భాగస్వామ్యం. రాజ్య రక్షణ అనేది కేవలం రాజు, సైనికుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజల సహకారం కూడా అవసరమనే భావన నవలలో కనిపిస్తుంది. కోటల చుట్టూ నివసించే ప్రజలు, స్థానిక పరిస్థితులపై అవగాహన ఉన్నవారు, సైనికులకు అందించే సహాయం వంటి అంశాలు యుద్ధ సమయంలో ప్రాధాన్యం సంతరించుకుంటాయి. ఈ విధంగా సైనిక వ్యవస్థను కేవలం ఆయుధాలు, సైనిక బలగాలకే పరిమితం చేయకుండా, దాని వెనుక ఉన్న సామాజిక, భౌగోళిక అంశాలను కూడా రచయిత ప్రస్తావించారు.

6. యుద్ధ ప్రభావం – సామాన్య ప్రజల జీవితాలు

ఈయన రచనల్లో కనిపించే మరో ముఖ్యమైన లక్షణం చారిత్రక సంఘటనలను సామాన్య ప్రజల జీవితాలతో అనుసంధానించడం. సాధారణంగా చరిత్రలో రాజుల విజయాలు, పరాజయాలు, యుద్ధాలు, రాజ్య విస్తరణ వంటి అంశాలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. కానీ యుద్ధాల వల్ల సామాన్య ప్రజలు ఎదుర్కొనే కష్టాలను కూడా గుర్తించడం అవసరం. ఈ మానవీయ కోణాన్ని రచయిత మాలిక్ కాఫర్ నవలలో ప్రత్యేకంగా ఆవిష్కరించారు.

నవలలో దానయ్య అనే వృద్ధుడి కుటుంబానికి సంబంధించిన సంఘటన ఇందుకు చక్కటి ఉదాహరణ. సైనిక దండయాత్రలో అతని కుటుంబం తీవ్రంగా నష్టపోతుంది. భార్యను, తనకు తోడుగా ఉన్న పెంపుడు జంతువును కోల్పోవడంతో పాటు, అతని గుడిసె కూడా అగ్నికి ఆహుతవుతుంది. ఒక సాధారణ వ్యక్తి జీవితంలో ఇల్లు, కుటుంబం

ఎంత ముఖ్యమో తెలియజేస్తూ, యుద్ధం కారణంగా ఒక్కసారిగా తనకు ఉన్నదంతా కోల్పోయిన దానయ్య పరిస్థితిని రచయిత హృదయానికి హత్తుకునేలా చిత్రించారు.

ఈ సంఘటన ద్వారా యుద్ధ ప్రభావం రాజులు, సైనికులకే పరిమితం కాదని, దాని భారాన్ని సామాన్య ప్రజలు కూడా మోయాల్సి వస్తుందని తెలుస్తుంది. రాజ్యాల మధ్య జరిగే పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొనని ప్రజలు సైతం కుటుంబ సభ్యులను కోల్పోవడం, ఇళ్లు ధ్వంసం కావడం, జీవనోపాధికి దూరమవడం వంటి సమస్యలను ఎదుర్కొంటారు. యుద్ధం వెనుక దాగి ఉన్న ఈ విషాదాన్ని దానయ్య పాత్ర ద్వారా రచయిత పాఠకులకు పరిచయం చేశారు.

చరిత్రలో యుద్ధం గెలిచిన రాజు పేరు నిలిచిపోవచ్చు. ఓడిపోయిన రాజ్యం గురించి కూడా చరిత్రలో ప్రస్తావించి ఉండవచ్చు. కానీ ఆ యుద్ధాల మధ్య నలిగిపోయిన సామాన్య ప్రజల బాధలు మాత్రం మరుగున పడిపోతాయి.. అనే నిజాన్ని అందరికీ అర్థమయ్యేలా చెప్పారు. చారిత్రక నవల అంటే కేవలం రాజులు, యుద్ధాల కథ మాత్రమే కాదని, ఆనాటి సాధారణ ప్రజల జీవితాలను కూడా ప్రతిబింబించగలదని ఈ ఘట్టం తెలియజేస్తుంది.

7. చరిత్రను సాహిత్యంగా మలిచిన సృజనశీలి

చారిత్రక నవల రాయడం అంటే చరిత్రలో జరిగిన సంఘటనలను యథాతథంగా వివరించడం మాత్రమే కాదు. చారిత్రక ఆధారాలను అధ్యయనం చేస్తూనే, పాత్రలు, సంభాషణలు, సన్నివేశాల ద్వారా ఆ కాలపు వాతావరణాన్ని పాఠకులకు అనుభూతి కలిగించేలా అందించాలి. ఈ ప్రక్రియలో కల్పనకు కూడా ఒక స్థానం ఉంటుంది. అయితే చారిత్రక వాస్తవాలకు, రచయిత కల్పనకు మధ్య ఉన్న తేడాను గుర్తించడం పాఠకులకు అవసరం.

'మాలిక్ కాఫర్' నవలలో ముదిగొండ శివప్రసాద్ గారు చారిత్రక నేపథ్యానికి కల్పనను జోడించి కథనాన్ని ముందుకు నడిపించారు. పాత్రల మధ్య సంభాషణలు, మతపరమైన చర్చలు, యుద్ధ సన్నివేశాలు, సాంస్కృతిక ప్రస్తావనలు నవలకు ప్రత్యేకతను తీసుకొచ్చాయి. కొన్ని సందర్భాల్లో రచయిత తన అభిప్రాయాలను కూడా పాత్రల సంభాషణల ద్వారా వ్యక్తం చేశారు. దీనివల్ల నవల కేవలం గతకాలపు కథగా మిగిలిపోకుండా, సమాజం, మతం, సంస్కృతి, రాజ్యరక్షణ వంటి అంశాలపై పాఠకులను ఆలోచింపజేస్తుంది.

ఉపసంహారం

చరిత్రను ఆసక్తికరంగా చెప్పడం ఒక ప్రత్యేకమైన రచనా నైపుణ్యం. ఆ నైపుణ్యంతోనే ముదిగొండ గారు అనేక చారిత్రక నవలలను తెలుగు పాఠకులకు అందించారు. ఆయన రచనల్లో కనిపించే విస్తృతమైన అధ్యయనం, చారిత్రక విషయాలపై ఆసక్తి, కథన నైపుణ్యం ఆయనను ప్రత్యేకమైన చారిత్రక నవలా రచయితగా నిలబెట్టాయి..

ఈ నవలను చదివేటప్పుడు చరిత్రలోని ఒక కాలాన్ని తెలుసుకోవాలనే ఆసక్తితో పాటు, ఆనాటి సమాజాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవాలనే ఆలోచన కూడా కలుగుతుంది. చరిత్రను అధ్యయనం చేయడం ద్వారా గతాన్ని తెలుసుకోవచ్చు. కానీ ఆ గతాన్ని అనుభూతి చెందేలా చేసేది మాత్రం సాహిత్యం మాత్రమే. ఆ దిశగా తన కలాన్ని కదిపిన ఆచార్య ముదిగొండ శివప్రసాద్ గారి సాహిత్య సేవ తెలుగు పాఠకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

చరిత్రను అక్షరాల్లో బంధించి, గతకాలపు జీవితాలను వర్తమానానికి పరిచయం చేసిన ఆ చారిత్రక నవలా చక్రవర్తికి ఇవే అక్షర నివాళులు!

ఉపయుక్తగ్రంథసూచి

1. శివప్రసాద్ ముదిగొండ, మాలిక్ కాఫర్, 2015
2. శ్యామలా దేవి దిట్టకవి, మాలిక్ కాఫర్ - ఒక పరిశీలన (వ్యాసం)
3. శివకుమార్ కొంపల్లి, పడిలేచిన కడలి తరంగం - తెలంగాణ (వ్యాసం)
4. వాణీకుమారి తుమ్మలపల్లి, కాకతీయుల సచ్చరిత్రం (వ్యాసం)

How to cite this article:
మ్యాడం అభిలాష్ (2026). 'మాలిక్ కాఫర్' నవల: కాకతీయ సాంస్కృతికజీవనచిత్రణ. *AUCHITHYAM*, 7(11), 1–7.

© 2026 AUCHITHYAM. Published under a Creative Commons Attribution 4.0 International (CC BY 4.0) licence.

గమనిక: *ఈ పత్రికలోని వ్యాసాలలో అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి.*
వాటికి సంపాదకులు గానీ, పబ్లిషర్స్ గానీ ఎలాంటి బాధ్యత వహించరు.